9

సాక్షి విశాఖపట్నం

శనివారం । 20 । మే । 2023

న్యూస్‌రీల్

సిటీకి కొత్త ఏడీసీపీలు



శ్రీనివాసరావు (ట్రాఫిక్)



నాగేంద్రుడు (ఎస్‌బీ)

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖ ట్రాఫిక్ ఏడీసీపీగా గుంటుపల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. రాష్ట్రంలో 18 మంది డీఎస్పీలకు అడిషినల్ ఎస్పీలుగా పదోన్నతులు కల్పించడంతో వారికి పోస్టింగ్‌లు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో శ్రీకాకుళం జిల్లా డీటీసీ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావు పదోన్నతిపై విశాఖ ట్రాఫిక్ ఏడీసీపీగా పోస్టింగ్ కల్పించింది. అలాగే అనంతపురంలో అడిషినల్ ఎస్పీ(అడ్మిన్)గా ఉన్న ఇ.నాగేంద్రుడును ఏడీసీపీ (ఎస్‌బీ)గా నియమించింది. ఇప్పటి వరకు ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో క్రైం ఏడీసీపీ గంగాధరం ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు.

డీసెట్-2023 దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం: డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశం కొరకు నిర్వహించే డీసెట్-2023కు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ యు. మాణిక్యం నాయుడు తెలిపారు. ఈ నెల 28 వరకు దరఖాస్తుకు గడువు ఉందన్నారు. ఎంట్రన్స్ పరీక్ష ద్వారానే ప్రభుత్వ, గుర్తింపు పొందిన కాలేజీల్లో ఉపాధ్యాయ విద్య శిక్షణ అభ్యశించే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు csc.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత గల విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి వివరాలు కావాల్సిన వారు భీమునిపట్నంలో ఉన్న డైట్ కాలేజీలో సంప్రదించవచ్చన్నారు.

ఇన్‌చార్జ్ డీఈవోగా లక్ష్మణరావు

విశాఖ విద్య: జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖాధికారిగా జి.లక్ష్మణరావు నియమితులయ్యారు. ప్రస్తుత డీఈవో ఎల్. చంద్రకళ తన వ్యక్తి గత కారణాలతో సెలవుపై వెళ్లారు. దీంతో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న లక్ష్మణరావుకు డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. విద్యాశాఖ చీఫ్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ జిల్లా పర్యటనలో డీఈవో హోదాలో పాల్గొన్న లక్ష్మణరావు, జిల్లా విద్యాశాఖకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.

డీసీఐ చైర్మన్‌గా అంగముత్తు



డా.అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) చైర్మన్, అదనపు డైరెక్టర్‌గా విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ డా. మదేయాన్ అంగముత్తు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను డీసీఐ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ శుక్రవారం జారీ చేశారు. త్వరలో నిర్వహించే డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నిర్వహించే వార్షిక సర్వసభ్య సమావేశంలో తదుపరి నిర్ణయం తీసుకోనున్నామని అంతవరకూ డా.అంగముత్తు చైర్మన్‌గా వ్యవహరిస్తారని డీసీఐ స్పష్టం చేసింది.

రేపు సాగర తీర స్వచ్ఛతకు తరలిరండి



దాబాగార్డెన్స్: సాగర్‌తీర స్వచ్ఛతలో స్వచ్ఛంద సంస్థలు, నగర పౌరులు, ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శుక్రవారం పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా భారతదేశం నిర్వహిస్తున్న జీ-20లో భాగంగా ఆదివారం ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో స్వచ్ఛత జన్ భాగీదరిలో భాగంగా మెగా బీచ్ క్లీనప్ కార్యక్రమం ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, జిల్లా యంత్రాంగం పాల్గొంటుందన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు 26,876 మంది హాజరు

విశాఖ విద్య: ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తాన్న ఏపీఈఏపీసెట్-2023లో భాగంగా శుక్రవారం నాటి పరీక్షకు 26,876 మంది హాజరయ్యారు. జిల్లాలో 93.75శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. విద్యార్థులను పూర్తి స్థాయిలో తనిఖీలు చేసిన తరువాతనే కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు.

వసూళ్లలో కళావర్ కింగ్

- చక్రం తిప్పుతున్న ఓ ఏసీపీ
- 15 రోజులకు రూ.లక్ష చొప్పున వసూలు
- సహకరిస్తున్న ఎస్‌ఐ, పీసీ
- పెందుర్తి, కంచరపాలెం నిర్వాహకులతో కుదిరిన బేరం
- తాత్కాలికంగా ఐపీఎల్ బిజీతో మూతపడిన స్టీల్ ప్లాంటు బోర్డు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

అతనొక బాధ్యత గల ఏసీపీ..పేక ముక్క ఫెళఫెళమంటే చాలు జేబు నిండాల్సిందే..వసూళ్ల టాస్క్ పెట్టుకున్నాడంటే నిద్రపోడంతే..తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని అందినంత దోచుకోవడమే ఈ కళావర్ కింగ్ పని. సాధారణంగా మామూళ్లు అంటే నెలకు ఇంత మొత్తం అని వసూలు చేయడం చూస్తుంటాం. అయితే, విశాఖలో ఓ ఏసీపీ మాత్రం 15 రోజులకు మామూళ్లు కావాలంటూ డిమాండ్ చేస్తున్నారు. పేకాట డెన్‌లను నిర్వహిస్తున్న యాజమానులను పిలిపించి మరీ బెదిరిస్తూ వసూళ్లకు తెగబడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి పోలీస్ బాస్‌లకు అందించాల్సిన సదరు ఏసీపీ కాస్తా సేకరించిన సమాచారంతో తన జేబులు నింపుకుంటున్న వైనం విమర్శలకు తావిస్తోంది. అంతేకాకుండా సదరు ఏసీపీకి ఒక ఎస్ఐతో పాటు పీసీ కూడా సహకరిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తుండటంతో స్టీల్ ప్లాంటు బోర్డు కాస్తా మూతపడగా... గోపాలపట్నం రౌడీషీటర్ నిర్వహించే పేకాట డెన్‌లో గొడవ జరగడంతో తాత్కాలికంగా నెల రోజుల పాటు మూసివేయాలని పోలీసులే సూచించినట్టు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా పట్టణ పరిసర ప్రాంతాలైన నరవ, దువ్వాడ, పెదగంట్యాడ ప్రాంతాల్లో ఎక్కువగా పేకాట బోర్డులు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. పెందుర్తితో పాటు కంచరపాలెంకు చెందిన పేకాట డాన్లతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్న సదరు ఏసీపీ బృందం .... ఐపీఎల్ సీజను తర్వాత స్టీల్ ప్లాంటుకు చెందిన 'మువ్వ'గోపాలుడు, గోపాలపట్నంకు చెందిన రౌడీషీటర్‌లతో వచ్చే నెల నుంచి మామూళ్ల బంధం తిరిగి ముడిపడనున్నట్టు సమాచారం.

గొడవైంది...కాస్తా ఆపండి

కొద్దిరోజుల క్రితం గోపాలపట్నంలో ఓ రౌడీషీటర్ నిర్వహించే పేకాట బోర్డులో గొడవ జరిగింది. అయితే, కేసుల దాకా వెళ్లకుండా గుట్టుచప్పుడు కాకుండా సద్దుమణిగే విధంగా చేశారు. ఈ గొడవ జరిగిన నేపథ్యంలో నెల రోజుల పాటు బోర్డు నిర్వహించవద్దంటూ కొద్ది మంది పోలీసుల నుంచే సూచనతో కూడిన ఆదేశాలు వెళ్లడంతో మూతపడినట్టు తెలుస్తోంది.

అయితే ఐపీఎల్ బిజీ కూడా ఉండటంతో సదరు రౌడీషీటర్ కాస్తా ఐపీఎల్ బెట్టింగ్‌లో మునిగినట్టు తెలుస్తోంది. ఇక స్టీల్ ప్లాంటు పరిధిలో నిర్వహించే మరో 'మువ్వ'గోపాలుడు కాస్తా ఐపీఎల్ బెట్టింగ్‌లో బిజీగా ఉన్నట్టు సమాచారం. ఈ ఐపీఎల్ బెట్టింగ్ బిజీ ముగిసిన వెంటనే తిరిగి పేకాట బోర్డు నిర్వహణకు ఇప్పటికే ఒప్పందం కూడా కుదిరినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరు 15 రోజులకు చెరో రూ.50 వేలు ఇప్పటికే సర్దుబాటు చేస్తున్నట్టు తెలుస్తోంది.

పెందుర్తి.....దువ్వాడ...!

విస్తరిస్తున్న విశాఖ నగరంలో పేకాట శిబిరాలు ఎక్కువగా శివారు ప్రాంతాల్లో నడుస్తున్నాయి. ప్రధానంగా పెందుర్తి, దువ్వాడ, గాజువాక, నరవ, పెదగంట్యాడ, భీమిలి ప్రాంతాల్లో పేకాట డెన్‌లను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే స్థానికంగా ఉండే స్టేషన్ సిబ్బందికి మామూళ్లు ఇస్తున్న సదరు నిర్వాహకుల నుంచి ఇప్పుడు సమాచారం సేకరించి గుట్టుచప్పుడు కాకుండా అదే విభాగంలో ఉన్న ఏసీపీ కూడా వసూళ్లకు డిమాండ్ చేస్తున్నారు. ఈ డెన్‌లు పెందుర్తి, గాజువాక, కంచరపాలేనికి చెందిన పేకాట డాన్‌ల చేతుల్లో ఉంటున్నాయి. ఇప్పటికే పెదగంట్యాడ, కంచరపాలెంకు చెందిన ఇద్దరు డాన్‌ల సారథ్యంలో 15 రోజులకు ఒకసారి చెరో రూ.లక్ష వసూలు చేయిస్తున్నారు.

ఎంత హాయి..



అక్కయ్యపాలెం హైవేపై చేరిన వర్షపు నీరు

సాక్షి, విశాఖపట్నం: కొన్నాళ్లుగా భానుడు తీవ్రమైన ఎండలు.. వడగాడ్పులతో జనాన్ని బేజారెత్తిస్తున్నాడు. నిత్యం అదే పనిగా నిప్పులు చెరుగుతున్నాడు. ఉష్ణతాపంతో అల్లాడిపోతున్న జనంపై వరుణుడు కరుణించాడు. శుక్రవారం సాయంత్రం కొన్నిచోట్ల, రాత్రి మరికొన్ని ప్రాంతాల్లోనూ ఆకస్మికంగా పన్నీటి జల్లులు కురిపించాడు. దీంతో చాలా రోజులుగా చల్లదనం, వర్షం కోసం పరితపిస్తున్న వారికి కొండంత ఊరటనిచ్చాడు. జిల్లాల్లో పలుచోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. దీంతో సెగలుకక్కే వాతావరణం నుంచి హాయిగొలిపే వాతావరణానికి మారిపోయింది. ఈదురుగాలుల ప్రభావంతో నగరంలో ఒకట్రెండు చోట్ల కొంతసేపు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. నగరం నలుమూలలా చెప్పుకోదగిన స్థాయిలో కురిసిన వర్షానికి నగరవాసులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఎంత హాయి.. ఈ రేయి అంటూ అనూహ్యంగా మారిన ఈ ఆహ్లాదకర పరిస్థితిని ఎంతగానో ఆస్వాదించారు.

21న బాలలకు 'సాక్షి' చిత్రలేఖనం పోటీలు



దొండపర్తి (విశాఖ దక్షిణ): సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన బాలలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో రెండు కేటగిరీలలో 10 ఏళ్లలోపు, అలాగే 10 నుంచి 16 ఏళ్లలోపు విద్యార్థులకు ఈ పోటీలు ఉండనున్నాయి. జూనియర్స్ విభాగంలో 'సేవ్ వాటర్', సీనియర్ విభాగంలో 'బ్యూటీ ఆఫ్ వైజాగ్' థీమ్‌పై పోటీలు జరగనున్నాయి. ఆసక్తి ఉన్న బాలలు ఈ నెల 20వ తేదీ లోగా అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్ ప్రాంతంలో ఉన్న సాక్షి కార్యాలయంలో గానీ, 8121703348 ఫోన్ నంబర్‌కు గానీ సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. డ్రాయింగ్‌కు అవసరమైన షీట్లు, ఇతర సామగ్రిని విద్యార్థులే వెంట తీసుకురావాల్సి ఉంటుంది. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు కన్సోలేషన్ ప్రైజులు కూడా అందించనున్నారు.

సంప్రదించాల్సిన చిరునామా :
సాక్షి కార్యాలయం, అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్, ఫోన్ : 8121703348

సీఎం పాలన దేశానికే ఆదర్శం

- కలెక్టర్ మల్లికార్జున
- ఉత్తమ వలంటీర్లకు నగదు పురస్కారాలు
- పది రోజులపాటు ప్రదానోత్సవ కార్యక్రమాలు



వలంటీర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున



పురస్కారగ్రహీతలతో కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు



థ్యాంక్యూ సీఎం సార్...

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది..సీఎం విజన్ ఇతర రాష్ట్రాలకు దిక్సూచిగా మారుతోందని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. గాంధీజీ కలలగన్న గ్రామ స్వరాజ్యం సాకారం కోసం సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు నేడు దేశంలో ఇతర రాష్ట్రాలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయంటే సీఎం విజన్ ఎలాంటిదో మనం అర్థం చేసుకోవచ్చునన్నారు. శుక్రవారం సిరిపురంలోని వుడా చిల్డ్రన్ ఎరీనాలో వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంలో వారి పాత్ర కీలకమైందన్నారు. ఏడాదికి ఒకసారి నిర్వహించే ఈ సన్మాన ఉత్సవాలు పదిరోజు పాటు సాగనున్నాయన్నారు. మండలం, రీజినల్ స్థాయిలో ఈ ఉత్సవాలు సాగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 9,560 మందికి ఈ పదిరోజుల్లో సత్కరించనున్నట్టు చెప్పారు. అందులో 31 మందికి సేవ వజ్ర పురస్కారాలను కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అందజేశారు. 107 మందికి సేవ రత్న, 9,422 మందికి సేవ మిత్ర పురస్కారాలను రానున్న పది రోజుల్లో అందజేస్తున్నట్లు తెలిపారు. సేవా వజ్రకు రూ.30 వేలు, సేవ రత్నకు రూ.20 వేలు, సేవ మిత్రకు రూ.10 వేలు చొప్పున అందజేస్తున్నట్టు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు చేరేందుకు వలంటీర్ల వ్యవస్థ గొప్పగా పనిచేస్తోందన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 420 కమిటీల పేరుతో ప్రజలను దోచుకున్నారన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన వారికి మాత్రమే ప్రభుత్వ లబ్ధి చేకూరేదన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు తలుపుతట్టి మరీ అందజేస్తోందన్నారు. ఏటా వలంటీర్లను సత్కరించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చిన్నతల్లి, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మరింత ఉత్సాహంగా..



ఉత్తర నియోజకవర్గం 45వ వార్డు తాటిచెట్లపాలెం సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్నాను. సేవా వజ్ర పురస్కారానికి ఎంపికయ్యానని మా సచివాలయ అడ్మిన్ చెప్పారు. చాలా ఆనందంగా ఉంది. అంకితభావంతో సేవలందించాను. దానికి ప్రభుత్వ గుర్తింపు లభించింది. రూ.30 వేల నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నాను. ఈ గుర్తింపు మరింత ప్రోత్సాహానిస్తుంది.

– పి.శాంతి, సేవా వజ్ర అవార్డు గ్రహీత

ఆనందంగా ఉంది



సేవా వజ్ర అవార్డు రావడం ఆనందంగా ఉంది. మా శ్రమకు తగిన గుర్తింపు వచ్చింది. ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా పనిచేస్తున్నాం. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో మా శక్తి మేరకు పనిచేస్తున్నాం. మమ్మల్ని గుర్తించి అవార్డులు అందజేయడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

– కత్రి శేఖర్, వలంటీర్, సింహాద్రిపురం, 15వ వార్డు

ప్రోత్సాహం మరువలేను



వలంటీర్‌గా చేస్తున్న సేవలకు గుర్తింపు లభించింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మా సేవలను గుర్తించి సేవా వజ్ర పురస్కారానికి ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. మరింత ఉత్సాహంగా పనిచేస్తాం. ప్రభుత్వ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తాం.

– ఈతలపాక మంజు, వలంటీర్, భూపేష్‌నగర్ , 34వ వార్డు

పకడ్బందీగా 'జగనన్న విద్యా కానుక'

- జేవీకే కిట్ల నాణ్యతలో రాజీ పడొద్దు
- విద్యాశాఖ చీఫ్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్



గాజువాక జెడ్పీ హైస్కూల్ స్టాక్ పాయింట్‌లో నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

గాజువాక : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లలోని ఐటెమ్స్ నాణ్యత విషయంలో రాజీ వద్దని ఏపీ విద్యాశాఖ చీఫ్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బూట్ల నాణ్యతను, వాటి కొలతలను ఈ సందర్భంగా పరిశీలించారు. పుస్తకాల సైజ్ తాము టెండర్‌లో చెప్పిన విధంగా ఉందా అనే విషయాన్ని టేప్‌తో కొలిచి పరిశీలించారు. అనంతరం పెన్నుతో రాసి పేపర్ నాణ్యతను పరిశీలించారు. వచ్చే ఏడాది నుంచి ప్రతి నోట్ పుస్తకంపై పేజీల సంఖ్యను కూడా ముద్రించాలన్నారు. అనంతరం బూట్లను, పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. బూట్ల సైజ్‌లను సరిచూడటం కోసం ఆయన స్వయంగా వాటిని ధరించారు. పాఠ్యపుస్తకాలు ఏ టైటిల్స్ వచ్చాయి, ఇంకా రావాల్సి ఉన్న టైటిళ్లు ఏమిటన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు వచ్చిన కిట్లను తెరిచి చూడకపోడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కిట్లను తెరిచి వాటి

మిగతా 10వ పేజీలో ▸

చంద్రబాబు వ్యాఖ్యలపై పెల్లుబికిన ప్రజాగ్రహం

- పేదలకు ఇచ్చిన సెంటు స్థలం శవాలు పూడ్చడానికి సరిపోతుందనడంపై దుమారం
- వాడవాడలా నిరసన జ్వాలలు
- నగరంలో మానవహారాలు, ర్యాలీలు



పెందుర్తిలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఇళ్ల పట్టా లబ్ధిదారులు



ఊర్వశి జంక్షన్ హైవేలో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

దొండపర్తి (విశాఖ దక్షిణ): పేదలకు ఇచ్చిన సెంటు స్థలం శవాన్ని పూడ్చడానికి సరిపోతుందని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. పేద మహిళల సొంతింటి కల నేరవేరుతున్న వేళ.. చంద్రబాబు అసహనంతో వారిని కించపరిచేలా మాట్లాడడంపై మహిళా లోకం భగ్గుమంటోంది. అధికారంలో ఉన్నపుడు ఒక్కరికి కూడా ఇంటి పట్టాలు ఇవ్వకపోగా.. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ఇళ్ల స్థలాలను బరియల్‌తో పోల్చడంపై మహిళలు మండిపడుతున్నారు. చంద్రబాబు అసహనం, అహంకారపూరితంగా చేసిన ఈ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని సమాధి చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో వాడవాడలా నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. చంద్రబాబు భేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

- ఉత్తర నియోజకవర్గం పరిధిలో ఊర్వశీ జంక్షన్ వద్ద నెడ్‌క్యాప్ చైర్మన్, నియోజకవర్గం సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు 32 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తుంటే వాటిని చంద్రబాబు శ్మశానాలు, సమాధులతో పోల్చడం దుర్మార్గమన్నారు.
- పెందుర్తి జంక్షన్‌లో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో మానవహారం చేపట్టారు. చంద్రబాబు వెంటనే పేద మహిళలకు క్షమాపణ చెప్పాలని, లేదంటే వారే తెలుగుదేశం పార్టీకి గట్టి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.
- కొమ్మాది జంక్షన్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విగ్రహం వద్ద 5, 6, 7 వార్డు కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రబాబు తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.
- పార్టీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఇసుకతోట కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించి, నిరసన తెలిపారు.

శొంఠ్యాంలో ఆయుర్వేద ఔషధ ఉత్పత్తి కేంద్రం

- ఔషధ పరీక్ష ప్రయోగశాల కూడా..
- రెండెకరాల స్థలం కేటాయింపు
- రూ.5 కోట్ల నిధుల విడుదల

ఆనందపురం: ఆనందపురం మండలం శొంఠ్యాంలో భారత్ ఆయుష్మాన్ పథకం కింద రాష్ట్రస్థాయి ఆయుర్వేద ఔషధ ఉత్పత్తి కేంద్రం, ఔషధ పరీక్ష ప్రయోగశాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విభజనకు ముందు హైదరాబాద్‌లోని ఆయుర్వేద ఫార్మసీ నుంచి రాష్ట్రంలోని ఆయుర్వేద ఆస్పత్రులకు మందులు సరఫరా అయ్యేవి. రాష్ట్ర విభజన అనంతరం మందులు సరఫరా నిలిచిపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి మందులు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 120 ఏళ్ల నుంచి నడుస్తున్న శొంఠ్యాం ఆయుర్వేద వైద్యశాల వద్ద ఔషధ ఉత్పత్తి కేంద్రం, ఔషధ ప్రయోగశాలను ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఈ ప్రాంతం జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో రవాణాకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ నుంచే రాష్ట్రంలోని అన్ని ఆయుర్వేద ఆస్పత్రులకు మందులు సరఫరా అవుతాయి. ఇక్కడ భవన నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రెండెకరాల స్థలాన్ని కేటాయించగా, కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు ఇటీవల ఇంజినీరింగ్ అధికారులు, ఆర్కిటెక్చర్లు పరిశీలించి వెళ్లారు. నిర్మాణ పనులను ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపట్టనుంది.

ఇవీ విశేషాలు..

ఇక్కడ ఏర్పాటు చేయబోయే ఔషధ ఉత్పత్తి కేంద్రం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలకు మందులు సరఫరా అవుతాయి. ముందుగా ముడి సరుకులను సేకరించి వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తారు. తర్వాత ఫార్మాసిస్టులచే మందులు తయారు చేస్తారు. మాత్రలు, తైలాలు, చూర్ణాలు, లేహ్యాలు వంటి వాటిని ఉత్పత్తి చేస్తారు. మందులను నిల్వ చేయడానికి ప్రత్యేకంగా ఓ గదిని నిర్మిస్తారు.

- ఔషధ తయారీకి వినియోగించే ముడి సరుకుల సరఫరా కోసం టెండర్‌ను పిలుస్తారు. అలా వివిధ మార్గాల నుంచి సేకరించిన వన మూలికలు, వివిధ రకాల కాండాలను ఇక్కడ స్వచ్ఛీకరణ చేసి నాణ్యతను పరిశీలిస్తారు. అనంతరం నిశితంగా పరిశీలించి ఔషధ ఉత్పత్తి కేంద్రానికి అందజేస్తారు. తర్వాత ఉత్పత్తి అయిన ఔషధాల నాణ్యత, పరిమాణాలను పరిశీలించి సరఫరాకు అనుమతిస్తారు. ఇక్కడ నుంచి మందులు అన్ని ఆయుర్వేద ఆస్పత్రులకు సరఫరా అవుతాయి. ఈ విషయమై ఆయుష్ విభాగం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వై.శేఖర్ మాట్లాడుతూ అధికారులతో కలిసి ఇటీవల స్థల పరిశీలన చేశామన్నారు. టెండర్లు పిలిచి తొందరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.



ఔషధ ఉత్పత్తి కేంద్రం, ప్రయోగశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దివ్యాంగ విద్యార్థులకు హెల్త్ బీమా

- రూ.1,34,500 చెల్లించేందుకు ముందుకొచ్చిన కలెక్టర్

మహారాణిపేట: దివ్యాంగ పిల్లల కోసం నిరమయ హెల్త్ స్కీమ్ కింద ఏడాది ప్రీమియం చెల్లించడానికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ముందుకొచ్చారు. సంజీవని నిధి నుంచి 512 మంది విద్యార్థులకు రూ.1,34,500 అందజేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. జిల్లాలో మొత్తం 512 మంది దివ్యాంగ విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో బీపీఎల్ కింద 485 మంది విద్యార్థులుండగా, ఏపీఎల్ కింద 27 మంది ఉన్నారు. బీమా కోసం బీపీఎల్ విద్యార్థి ఒక్కొక్కరి ఏడాదికి రూ.250, ఏపీఎల్ విద్యార్థి ఒక్కొక్కరి రూ.500 చెల్లించాల్సి ఉంది. అక్కయ్యపాలెం ఎన్‌జీజీవో కాలనీ హైస్కూల్ వద్ద శనివారం జరిగే ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొంటారు.

గంజాయి కేసులో మరొకరి అరెస్ట్

సీతమ్మధార: గంజాయి తరలించేందుకు సహకరించిన ఒకరిని ఫోర్త్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 9న ఏజెన్సీ ప్రాంతం నుంచి కేరళకు చెందిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. వీరికి పాడేరుకు చెందిన త్రినాథ్ సహకరించినట్లు గుర్తించారు. పాడేరులో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. త్రినాథ్‌కు మత్రిపాలెం, పాడేరు, అరకులో నివాసాలు ఉన్నట్లు విచారణలో తేలింది. అతని నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



అప్పన్న హుండీల ఆదాయం రూ.3.05 కోట్లు

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామి హుండీల ఆదాయం లెక్కింపు రెండవ రోజైన శుక్రవారం కొనసాగింది. ఈ లెక్కింపులో రూ.1,15,55,513 ఆదాయం వచ్చినట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. నగదుతో పాటు 94.510 గ్రాముల బంగారం, 9.135 కిలోల వెండి లభించినట్లు వెల్లడించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గురువారం జరిగిన లెక్కింపులో 1,89,90,670 ఆదాయం రాగా.. శుక్రవారం లెక్కించిన ఆదాయం కలుపుకుని 3,05,46,183 వచ్చినట్లు ఈవో తెలిపారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

సీతామహాలక్ష్మి ఇకలేరు



డాబాగార్డెన్స్: విశాఖ అన్నదాతగా పేరు గాంచిన మట్టపల్లి చలమయ్య సతీమణి సత్య వెంకట సీతామహాలక్ష్మి ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మధ్యాహ్నం తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆమెకు 94 ఏళ్లు. హనుమంతురావు, సత్యనారాయణ, విశ్వేశ్వరరావు వీరి కుమారులు. వసుదైక కుటుంబంగా పేరు గాంచింది. దాన ధర్మాలకు పెట్టింది పేరు ఈ కుటుంబం. సీతామహాలక్ష్మి మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు వీఐపీ రోడ్డులోని ఆమె స్వగృహం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమవుతుంది. కాన్వెంట్ జంక్షన్‌లోని హిందూ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుమారుడు హనుమంతరావు తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థుల మృతదేహాలు లభ్యం

సింహాచలం: నరవలోని క్వారీ గుంత చెరువులో గురువారం గల్లంతైన విద్యార్థుల మృతదేహాలు లభ్యమయ్యాయి. విశాఖ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు పరీక్ష రాసి గురువారం మధ్యాహ్నం గుంతల చెరువులో ఈతకు దిగారు. ఈ క్రమంలో మళ్ల రాజేష్, బండారు నిఖిల్ గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో రాజేష్ మృతదేహం, శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో నిఖిల్ మృతదేహం లభ్యమయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించినట్లు పెందుర్తి పోలీసులు తెలిపారు.

'ఇండియన్ ఐడల్ తెలుగు'లో సౌజన్యను గెలిపించండి



డాబాగార్డెన్స్: ఆహా ఓటీటీలో ప్రసారమవుతున్న ఇండియన్ ఐడల్ తెలుగు సీజన్-2లో నగరానికి చెందిన సౌజన్య భాగవతుల అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారు. ఈ సీజనల్‌లో విజేతగా నిలవాలంటే ప్రజల అండదండలు అవసరమని ఆమె అభ్యర్థించారు. శనివారం రాత్రి 8 నుంచి ఆదివారం మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ అందుబాటులో ఉంటుందని, నగర ప్రజలందరూ తనకు ఓటు వేయాలన్నారు. ఈ సందర్భంగా విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ సౌజన్యకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తన గానంతో న్యాయ నిర్ణేతల ప్రశంసలతో పాటు సంగీత ప్రియుల అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు.

పకడ్బందీగా 'జగనన్న విద్యా కానుక'

▸ 9వ పేజీ తరువాయి

నాణ్యతను ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించారు. కిట్లలో నాణ్యత లేకపోతే నేరుగా తనకే తెలియజేయాలన్నారు.

కాంట్రాక్టర్లకు బ్లాక్ లిస్టు తప్పదు

పాఠశాలలకు సరఫరా చేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లలో నాణ్యత లేకపోతే సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామని ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. వాస్తవాలను చెప్పేందుకు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. తనకు ఇద్దరే స్నేహితులున్నారని, వారిలో ఒక సత్యం, మరొకరు సాహసం అని పేర్కొన్నారు. తాను వారినే ఎక్కువగా ఇష్టపడతానన్నారు.

ఉపాధ్యాయులు బాధ్యతగా ఉండాలి

ఉపాధ్యాయులు బాధ్యతగా ఉండాలని ప్రవీణ్ ప్రకాష్ సూచించారు. బదిలీ ఉపాధ్యాయులు (సీఆర్‌పీలు) గత విద్యా సంవత్సరంలో జనవరి నుంచి మార్చి వరకు ప్రభుత్వం ఆశించిన విధంగా పని చేయాలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఆర్‌పీలు వీలైనన్ని ఎక్కువ తరగతులకు హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయులందరివద్ద తాము చదువు చెబుతున్న విద్యార్థుల ఫోన్ నంబర్లు ఉండాలన్నారు. వారు పాఠశాలకు రాకపోతే ఫోన్ చేసి వారి తల్లిదండ్రుల నుంచి కారణం తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి పాఠశాలకు విచ్చేసి ప్రవీణ్ ప్రకాష్‌తోపాటు స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో లక్ష్మణరావు, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్, ఎస్ఎస్ఏ పీవో శ్రీనివాసరావు, ఎంఈవో పైడపునాయుడు, గాజువాక జిల్లా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లు దారి మళ్లింపు, కొన్ని రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్ డివిజన్ చర్లపల్లి–ఘట్‌కేసర్ సెక్షన్ మధ్య జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం పలు రైళ్ల రీషెడ్యూల్, మరికొన్ని దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె. త్రిపాఠి తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని కోరారు.

నేడు రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- హౌరా–సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా ఉదయం 11.35 గంటలకు బయలుదేరుతుంది.
- భువనేశ్వర్–ముంబయి(11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరుతుంది.
- విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్య రాత్రి 12.20 గంటలకు బయలుదేరుతుంది.

దారి మళ్లించిన రైళ్లు

- విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు వయా విజయవాడ, కృష్ణా కెనాల్ జంక్షన్, గుంటూరు, పగిడిపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- షాలిమార్–సికింద్రాబాద్ (22849) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24, 31 తేదీల్లో వయా ఏలూరు, విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా ప్రయాణిస్తుంది.
- యశ్వంత్‌పూర్–టాటానగర్ (18112) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21, 28, జూన్ 4 తేదీల్లో వయా సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు మీదుగా ప్రయాణిస్తుంది.
- హైదరాబాద్–షాలిమార్ (18046) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28, జూన్ 7 తేదీన వయా గుంటూరు, పగిడిపల్లి, సికింద్రాబాద్ మీదుగా ప్రయాణిస్తుంది
- సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా విశాఖపట్నం–అమృత్‌సర్(20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27న వయా విజయనగరం, టిట్లాఘడ్, సంబల్‌పూర్ మీదుగా నడుస్తుంది.

విశాఖ–బెంగళూరు స్పెషల్ పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం–బెంగళూరు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం–బెంగళూరు కంటోన్మెంట్ (08543) వీక్లీ స్పెషల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ ఆదివారం విశాఖపట్నంలో మధ్యాహ్నం 3.55 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ జూన్ 4 నుంచి 25వ తేదీ వరకు పొడిగించారు. బెంగళూరు కంటోన్మెంట్– విశాఖపట్నం (08544) వీక్లీ స్పెషల్ ప్రతి సోమవారం మధ్యాహ్నం 3.50 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 5 నుంచి 26వ తేదీ వరకు పొడిగించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న అమరావతి జేఏసీ నాయకులు

మహారాణిపేట: ఏపీ జేఏసీ అమరావతి పిలుపు మేరకు ఉద్యమం మూడో దశలో భాగంగా శుక్రవారం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను కలిసి వినతిపత్రం సమర్పించినట్టు జేఏసీ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి తెలిపారు. అలాగే ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, గణబాబులను కలిసి వినతిపత్రాలు అందించామన్నారు. సకాలంలో ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఎరియర్స్, డీఏను విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ.త్రినాథ్‌రావు, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా సంఘ అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి నాగయ్య, గ్రామ/వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సురేష్ కుమార్, ఆర్టీసీ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.ఎస్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బైకర్ వర్సెస్ పోలీస్



నడిరోడ్డుపై పోలీసుతో బైకర్ వాగ్వాదం

డాబాగార్డెన్స్ : సౌత్ జైలు రోడ్డులోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి కూడలిలో శుక్రవారం పోలీసులు, ద్విచక్ర వాహన చోదకుడికి మధ్య వాగ్వాదం జరిగింది. ఓ ద్విచక్ర వాహన చోదకుడు హెల్మెట్ ధరించకుండా వెళ్తున్నాడు. ట్రాఫిక్ పోలీస్ వాహనాన్ని ఆపి.. హెల్మెట్ లేదు.. ఫైన్ కట్టాలని అతనికి సూచించాడు. ఎండ తీవ్రత దృష్ట్యా హెల్మెట్ ధరించలేకపోయాను.. ఆఫీసుకు టైం అవుతుందని అతను చెప్పగా.. ఫైన్ కట్టాల్సిందేనని పోలీస్ స్పష్టం చేశాడు. ఆన్‌లైన్‌లో ఫైన్ కట్టేస్తానని అతను చెప్పడంతో.. ట్రాఫిక్ పోలీస్ వాహనాన్ని ఆపేశాడు. ఈ క్రమంలో వాహన చోదకుడు కాస్త దురుసుగా ప్రవర్తించాడు. దీంతో కొందరు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రజలు గుమిగూడారు. కొందరు ఈ గొడవను సెల్‌ఫోన్లలో చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వాహనచోదకుడు ట్రాఫిక్ పోలీస్ సెల్‌ఫోన్ తీసుకుని పరుగులు తీశాడు. 'ఇప్పుడు తెలిసిందా మా బాధ..' అంటూ మళ్లీ తీసుకొచ్చి ఇచ్చాడు. ఈ తతంగమంతా అరగంటకు పైగా సాగడంతో కూడలిలో నలువైపులా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగింది.

ఉమ్మడి ప్రణాళికతో డ్రగ్స్ రవాణాకు అడ్డుకట్ట

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఉమ్మడి కార్యాచరణతో రైల్వే మార్గాల్లో మాదక ద్రవ్యాల రవాణాకు పూర్తి అడ్డుకట్ట వేయనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ తెలిపారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీఎఫ్, ఎస్ఈబీ, సిటీ టాస్క్‌ఫోర్స్, క్రైమ్, రైల్వేస్టేషన్ పరిధిలోని లా అండ్ ఆర్డర్ అధికారులతో శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. రైల్వే మార్గాల ద్వారా జరుగుతున్న గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఏయే మార్గాల్లో రవాణా జరుగుతుంది, దాని తీరు, గత ఏడాది నుంచి నమోదైన కేసులపై విశ్లేషించి అన్ని శాఖలు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు.

యూత్ బాక్సింగ్ పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్ : యూత్ మెన్ వుమెన్ బాక్సింగ్ పోటీలు రైల్వే బాక్సింగ్ హాల్‌లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. మెన్,వుమెన్ ఆయా వెయిట్ కేటగిరీల్లో శనివారం నుంచి తలపడనుండగా.. శుక్రవారం బాక్సర్ల వెయింగ్‌ను నిర్ణయించారు. లాంఛనంగా పోటీలను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించగా పోటీలు శనివారం నుంచి జరగనున్నాయి. ఈకోరైల్వే, సాయ్, ఆర్పీఎఫ్ జట్లతో పాటు పలు జిల్లాలకు చెందిన బాక్సర్లు ఆయా వెయిట్ కేటగిరీల్లో పోటీపడనున్నారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఏడీఆర్ మనోజ్‌కుమార్, సీనియర్ డీఈ మోహన్, క్రీడాధికారి ప్రవీణ్‌భారతి తదితరులు పాల్గొన్నారు.

ఇనాం భూములపై ప్రతిపక్షాలది దుష్ప్రచారం

- వ్యవసాయశాఖ సలహా మండలి జిల్లా చైర్మన్ పెదబాబు

తగరపువలస: భీమిలి మండలం నారాయణరాజుపేటలోని ఇనాం భూములపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారంపై వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మజ్జివలసలో శుక్రవారం జరిగిన సమావేశంలో వ్యవసాయశాఖ సలహా మండలి జిల్లా చైర్మన్ దాట్ల పెదబాబు మాట్లాడారు. ఇనాం భూముల విషయంలో ఏదో జరిగిపోయిందని జరుగుతున్న ప్రచారంలో సీపీఎం, బీజేపీ పసలేని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఈ విషయంలో తనపై, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై చేస్తున్న ఆరోపణలను ఖండించారు. పేట భూములకు సంబంధించి రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు లేని వారే హక్కులు కల్పించాలని కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు మాట్లాడుతూ ఇనాం భూముల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. మండల సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి ఈ విషయాన్ని తీసుకువచ్చినా.. రైతులు ఎవరూ రాలేదన్నారు. ఇప్పటికైనా సాగులో ఉన్న రైతులు ముందుకొస్తే వారి దగ్గర ఉన్న రికార్డుల ప్రకారం సెటిల్‌మెంట్‌కు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులు దళారీల మాటవిని మోసపోవద్దన్నారు. పెదబాబు కుటుంబ సభ్యులు భూములు దానాలు చేశారు కాని ఎప్పుడూ కబ్జాలకు పాల్పడలేదన్నారు.

నారాయణరాజుపేట సర్పంచ్ కాద సూర్యనారాయణపై ఆరోపణలను రైతులు, ప్రతిపక్షాలు వెనక్కి తీసుకోవాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు కాద సూర్యనారాయణ, చెల్లూరి పైడప్పడు, మజ్జి సూరినాయుడు, పొట్నూరు చంద్రశేఖర్, తుపాకుల అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు మజ్జి శ్రీనివాసరావు, చెల్లూరి నగేష్, మాజీ సర్పంచ్ మద్దిల వెంకటరమణ, తుపాకుల అప్పలస్వామి పాల్గొన్నారు.

ఇనాం భూముల్లో 122 ఎకరాలు వేణుగోపాలస్వామివి..

భీమిలి మండలం నారాయణరాజుపేట గ్రామ పంచాయతీ 3, 4, 5, 6, 8, 15, 18, 25, 27, 28, 29, 31 సర్వే నంబర్లలో 122 ఎకరాలు పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి చెందినవని ఆ దేవస్థానం ఈవో ఎస్.నానాజీబాబు తెలిపారు. ఈ సర్వే నంబర్లలో భూములపై ఎలాంటి లావాదేవీలు చెల్లవన్నారు. అలా చేస్తే దేవదాయశాఖ చట్టం ప్రకారం వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.